క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీ



సరకుల పంపిణీ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: విజయవాడలో వరద బాధితుల ఇళ్ల వద్దకే ప్రభుత్వం అందజేసిన నిత్యావసర సరకులను వాహనాల ద్వారా పంపిణీ చేశామని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ విజయవాడ నుంచి తెలిపారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాలరెడ్డి పర్యవేక్షణలో విజయవాడ 64వ వార్డు కండ్రిక ఎస్ఎస్‌సీ బోస్ నగర్, ప్రజాశక్తి నగర్, మధురానగర్ తదితర ప్రాంతాల్లోని వరద బాధితులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా నిత్యావసర సరకులు అందించామన్నారు. ఈ కార్యక్రమానికి ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, సచివాలయ కార్యదర్శులు సహకరించారని చెప్పారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు.

జర్నలిస్టుల సేవలు సమాజానికి అవసరం



సత్కారం పొందిన జర్నలిస్టులతో వంశీకృష్ణ, కందుల నాగరాజు తదితరులు

అల్లిపురం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సేవలు సమాజానికి అవసరమని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్ట్ డే సందర్భంగా సోమవారం నగరంలోని పలువురు జర్నలిస్టులను 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ముఖ్య అతిథి వంశీకృష్ణ సత్కరించారు. నాగరాజు మాట్లాడుతూ సమాజ హితం కోరే జర్నలిస్టులను సన్మానించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, కందుల కేదార్‌నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నేత్రదాన పక్షోత్సవాలు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జగదీశ్వరరావు

సీతంపేట: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో సోమవారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధత్వ నివారణకు నేత్రదాన ఆవశ్యకతపై 15 రోజులపాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని అభినందించారు. మరణించిన తర్వాత కూడా నేత్రదానం వల్ల చిరంజీవులుగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా నేత్రదాన ఆవశ్యకతపై విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైద్యులు ప్రభాకర శాస్త్రి, జ్యోతిర్మయి, ఆర్ఎంవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు వాయు'గండం'



చిరు వ్యాపారాలు నిర్వహించే బళ్లను వర్షం కారణంగా టార్పాలిన్‌తో మూసేసిన దృశ్యం

- తెరిపివ్వని వర్షాలతో కష్టాలు
- వ్యాపారాలు సాగక ఆర్థిక ఇబ్బందులు

డాబాగార్డెన్స్: వాయుగుండం ప్రభావంతో తెరిపివ్వకుండా వర్షాలు కురవడంతో చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారికి వాయుగుండం ప్రభావం తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. గత రెండు రోజులుగా ఉదయం నుంచి రాత్రి వరకూ ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో రోడ్లన్నీ జన సంచారం లేక వెలవెలబోయాయి. జనం ఇంటికే పరిమితం కావడంతో రైతు మార్కెట్ విలవిలలాడింది. ఫుట్‌పాత్ వ్యాపారాలు సాగలేదు. పర్యాటక ప్రాంతాలకు మణిహారంగా నిలిచిన సముద్ర తీర ప్రాంతాలు శని, ఆది, సోమ వారాల్లో బోసిపోయాయి. నిత్యం పర్యాటకులు, సందర్శకులతో కళకళలాడే ఆర్కే బీచ్, గోకుల్ పార్క్, నోవాటెల్ బీచ్ వెలవెలబోయాయి. ఎక్కడా సందర్శకులు, పర్యాటకుల జాడ లేదు. దీంతో బీచ్‌లోని చిన్న చిన్న దుకాణాలన్నీ మూతపడ్డాయి.

చిత్తడిచిత్తడిగా రోడ్లు

వాయుగుండం ప్రభావంతో శుక్ర, శని, ఆది, సోమవారాల్లో నగరంలో కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ చిత్తడి చిత్తడిగా మారాయి. ప్రసాద్ గార్డెన్స్, పండా వీధి, అల్లిపురం, రెల్లి వీధి, రామకృష్ణా జంక్షన్, బౌడరా రోడ్డు, 75 ఫీట్ రోడ్డు, వెలంపేట, దుర్గాలమ్మ గుడి ఏరియా, పూర్ణా మార్కెట్, మెయిన్ రోడ్డు, పాత నగరం తదితర ప్రాంతాల రోడ్లన్నీ బురదతో నిండాయి. ఈ క్రమంలో వ్యాపారాలు సాగక గత నాలుగైదు రోజులుగా చిరు వ్యాపారులు లబోదిబోమంటున్నారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు వ్యాపారం సాగితేనే కుటుంబాన్ని పోషించుకుని బతుకు బండి లాగించగలమని... లేదంటే అప్పులు చేసుకుని బతకాలంటే కష్టంగా ఉంటుందని పలువురు చిరువ్యాపారులు వాపోతున్నారు. ఇలాంటి సమయాల్లోనే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



వర్షంలోనే ఉన్న చిరు వ్యాపారులు



వ్యాపారం సాగక బళ్లపై కూర్చున్న చిరు వ్యాపారులు

• పట్టించుకోకుంటే ప్రమాదమే..



బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీకి వెళ్లే దారిలో యూజీడీ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారడంతో అటు వైపు ప్రయాణిస్తున్న వారు మొక్కలు అడ్డుగా పెట్టారు. జీవీఎంసీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

\- ఫొటో, సాక్షి ఫొటోగ్రాఫర్

జేసీఐ వారోత్సవాలు ప్రారంభం

డాబాగార్డెన్స్: జేసీఐ విశాఖ వ్యాలీ వారోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విశాఖ నగర ప్రజలకు మంచి ఆరోగ్యంతోపాటు వృత్తి నైపుణ్యతపై అవగాహన పెంచుతూ ప్రతి ఒక్కరిలో నాయకత్వ లక్షణాలు పెంచుతూ జేసీఐ చేపట్టే ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 9 నుంచి 15 వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముందుగా నగరంలోని సీఎంఆర్ వద్ద జేసీఐ జెండా ఆవిష్కరించి వారోత్సవాలు ప్రారంభించారు. తొలిరోజు వృద్ధులతో సంతోషంగా గడిపారు. రెండో రోజు ఆరోగ్యపరమైన అవగాహన, మూడో రోజు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు జేసీఐ విశాఖ వ్యాలీ అధ్యక్షురాలు ఇంద్రజ సంకు తెలిపారు. చివరి రోజున పలు రంగాల్లో విశేష సేవలందించిన వారిని సత్కరించనున్నట్టు చెప్పారు. దేశవ్యాప్తంగా వారం రోజులపాటు జేసీఐ సంస్థల నేతృత్వంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జేసీఐ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వారోత్సవాల్లో వృద్ధులతో సంతోషంగా గడుపుతున్న జేసీఐ ప్రతినిధులు

పర్యావరణం, నీటి వనరులను పరిరక్షించాలి

విశాఖ సిటీ: పర్యావరణ పరిరక్షణకు ప్రజల ఆలోచన ధోరణి మారాలని ఏయూ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు సూచించారు. ఏయూ బయోటెక్నాలజీ విభాగంలో సోమవారం బయో ఈ3 పాలసీపై జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని, ప్రకృతిని కాపాడాలంటే.. చెట్ల నరికివేతను నిలిపివేయాలని, నీటి వనరుల ప్రాంతాల్లో నిర్మాణాలను నిరోధించాలన్నారు. సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్(సీడీఎఫ్‌డీ) ప్రతినిధి డాక్టర్ యతీష్ ఆచార్ మాట్లాడుతూ భవిష్యత్తులో బయోటెక్నాలజీతో సాంకేతిక విప్లవం వస్తుందని, 2030 నాటికి బయో ఎకానమీ 300 బిలియన్ డాలర్లు దాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి బయో ఎకానమీ 10 ట్రిలియన్ డాలర్లతో దేశ జీడీపీలో 25 శాతం మేర వాటా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. సదస్సులో సీడీఎఫ్‌డీ ప్రతినిధులు డాక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ఎం.వి.సుబ్బారెడ్డి, డాక్టర్ రమేష్ ఎలగందుల, డాక్టర్ అశ్విన్ దలాల్, ఏయూ బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్ పోలా సుధాకర్, డాక్టర్ ధనుంజయ్, డాక్టర్ పి.బిందియా, డాక్టర్ సుబ్బాతాతా, ప్రొఫెసర్ పద్దయ్య, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య ఎం.వి.ఆర్.రాజు

'ఎకో ఫ్రెండ్లీ'గా ఆదిత్య గణపతి



గెలుచుకున్న 25 కేజీల లడ్డూతో ఎఫ్ఎం బాబాయ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, జీకే ఫౌండేషన్ ప్రతినిధులు

అల్లిపురం: శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్, జీకే ఫౌండేషన్ సంయుక్తంగా నీలమ్మ వేపచెట్టు రోడ్డులో ఏర్పాటు చేసిన ఆదిత్య గణపతి 93.5 ఎఫ్ఎం వారి 25 కేజీల లడ్డూను గెలుచుకుంది. ఎకో ఫ్రెండ్లీ ఉత్తమ గణపతిగా వరుసగా నాలుగో ఏడాది అవార్డును సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం మండపం వద్ద జరిగిన కార్యక్రమంలో రెడ్ ఎఫ్ఎం రాజశేఖర్, ఎఫ్ఎం బాబాయ్ వానపల్లి ప్రదీప్, సిబ్బంది.. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా నిర్వాహకులకు లడ్డూను అందజేశారు. 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, భీశెట్టి గోపీకృష్ణ, వానపల్లి గాయత్రిదేవి, ఆకుల రాజు, బంటుపల్లి సూర్యనారాయణ, విల్లూరి భాస్కరరావు గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలు నాటుదాం

మహారాణిపేట: 'స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండి' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సోమవారం ర్యాలీ నిర్వహించారు. రేసపువానిపాలెం టీబీ ఆస్పత్రి కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ సత్యం జంక్షన్ మీదుగా తిరిగి ఆస్పత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా ధర్నా చేస్తున్న వారిని ఉద్దేశించి డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఉష్ణోగ్రతల పెరుగుదల వల్ల వడగాల్పులు అధికమై వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. ఇలాంటి వాతావరణంలో వ్యవసాయం, ఆరోగ్యంపై పెను ప్రభావం తప్పదని హెచ్చరించారు. స్వచ్ఛమైన గాలిలో పెట్టుబడి పెట్టండని, దీని కోసం మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ జీవన్‌రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు డాక్టర్ జగదీశ్ ప్రసాద్, బాలాజీ, ఐ.మనోరమ, బి.మురళీకృష్ణ, గణాంక అధికారి మణికుమారి, మోహన్, ఇతర వైద్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, సిబ్బంది

చెస్ చాంపియన్‌షిప్‌లో అఖిల్‌కు పతకాలు

ఎంవీపీకాలనీ: శ్రీలంక వేదికగా జరిగిన కామన్‌వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్‌లో విశాఖ బాలుడు గారపాటి అఖిల్ ప్రసాద్ సత్తా చాటాడు. ఎంవీపీ కాలనీకి చెందిన అఖిల్ ప్రసాద్ చాంపియన్‌షిప్‌లో రెండు రజిత పతకాలు సాధించాడు. ఆగష్టు 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు అండర్-12 కామన్ వెల్త్ యూత్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శ్రీలంకలో జరిగాయి. ఈ పోటీల్లో రాపిడ్, క్లాసికల్ ఫార్మెట్‌లలో అఖిల ప్రసాద్ 2 రజితాలు సాధించాడు. క్లాసికల్ విభాగంలో 24 మంది క్రీడాకారులు పోటీ పడగా 6.5 పాయింట్లతో 2వ స్థానాన్ని, రాపిడ్ విభాగంలో 31 మంది క్రీడాకారులు పోటీ పడగా 5.5 పాయింట్లు సాధించి 2వ స్థానాన్ని కై వసం చేసుకున్నాడు. తల్లిదండ్రులు గారపాటి శ్రీధర్, లక్ష్మీచైతన్యలతో పాటు పలువురు నగర క్రీడా ప్రముఖులు అఖిల్ ప్రసాద్‌కు అభినందనలు తెలియజేశారు.



పతకాలతో అఖిల్ ప్రసాద్

వక్రతుండాయ.. బహురూపాయ



అచ్చియ్యమ్మపేటలో కొలువైన వినాయకుడు



కొబ్బరితోటలో శంఖు గణపతి



కొబ్బరితోటలో తండ్రి మహాదేవుడి ఒడిలో కూర్చుని వీనా నాథం నేర్చుకుంటున్న గణేషుడు



ఆకట్టుకుంటున్న పార్వతీదేవి, బాల గణపతి విగ్రహం



వాడబలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల గణపతి

అల్లిపురం: వినాయక చవతి ఉత్సవాల్లో భాగంగా ఏకదంతుడు బహురూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నాడు. కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట ప్రాంతాల్లో వినూత్న రీతిలో వినాయక విగ్రహాలను నిర్వాహకులు ప్రతిష్ఠించి భక్తిని చాటుకున్నారు. సోమవారం భక్తులు గణనాథుడిని దర్శించుకుని పూజలు చేశారు.

నవ్వులు పూయించిన నాటికలు



పుటుక్కు జర జర డుబుక్కు మే.. నాటికలోని ఓ సన్నివేశం



బాదంగీర్ సాయిని సత్కరిస్తున్న ఎంవీపీ సిటీ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

మద్దిలపాలెం: బాదంగీర్ సాయి సారథ్యంలో రంగసాయి నాటక గ్రంథాలయం ఆధ్వర్యంలో సోమవారం ఎంవీపీ సిటీలో విశాఖకు చెందిన కేవీ మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సభ్యులు ప్రదర్శించిన పుటుక్కు జర జర డుబుక్కు మే.. నాటిక ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. పి.శివప్రసాద్ దర్శకత్వంలో 165వ నాటికగా దీనిని ప్రదర్శించారు. సందేశాత్మక, ప్రయోగాత్మక, హాస్య నాటికగా పుటుక్కు జర జర డుబుక్కు మే ఆనందాన్ని పంచింది. ప్రేక్షకులు ఆనందడోలికల్లో మునిగితేలేలా నటీనటులు నాటిక ఆద్యంతం వారి ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. అనంతరం మాడభూషి దివాకర్ బాబు రాసిన ఎరువు సొమ్ము.. బరువు చేటు నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. పి.శివప్రసాద్ దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. ప్రసాదంగా పి.శివప్రసాద్, జానకిగా కె.విజయలలక్ష్మి, కాశీపతిగా సెల్వరాజ్, రామనాథంగా ఓలేటి శంకర్, చాకలిగా ఈటి రాంబాబు, వేలంపాట వెంకిగా చంద్రరావు, పేపర్ బాయ్‌గా అప్పలరాజు నటించి మెప్పించారు. ఈ నాటికలకు సంగీతం సత్యనారాయణ అందించగా, సెట్టింగ్‌లను అప్పారావు, మేకప్‌ను సుబ్బారావు చేశారు. లైటింగ్‌కు ఎం.అప్పలరాజు సహకారం అందించారు. రంగసాయి బృందం శివజ్యోతి, వియ్యపు రామకృష్ణ, చిన్నబాబు, ఆదినారాయణ సహకరించారు. ఈ సందర్భంగా బాదంగీర్ సాయిని ఎంవీపీ సిటీ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు.

ఆస్పత్రా.. అవుట్ పోస్టా..!

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధి హనుమంతవాక వద్ద ట్రాఫిక్ అవుట్ పోస్టు తికమకగా మారింది. ఇది పోలీస్ 'ట్రాఫిక్ అవుట్ పోస్టా.. లేక మెడికవర్ ఆస్పత్రా' అని తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైనా ఫిర్యాదు చేయాలని ఇక్కడికి వెళ్లాలనుకునే వారికి దీనిపై ఉన్న ప్రకటన బోర్డులు చూసి మెడికవర్ ఆస్పత్రికి వచ్చామా అంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. ఆస్పత్రే కదా అంటూ కొందరు రోగులు వైద్యం కోసం లోపలికి వెళ్తే ఖాకీ డ్రెస్‌తో లాఠీలు పట్టుకొని కనిపించే పోలీసులను చూసి ఎక్కడకి వచ్చామో అంటూ వెనుదిరుగుతున్నారు. ఇక్కడ ట్రాఫిక్ అవుట్ పోస్టు ఎక్కడ ఉందో అంటూ పలువురిని అడిగితే గాని తెలియని పరిస్థితి. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాలపై పెద్ద అక్షరాలతో బోర్డులు ఉంటాయి. ఇక్కడ మాత్రం ఆరిలోవ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అవుట్ పోస్ట్ అని ఆంగ్లంలో కనీకనిపించని విధంగా అక్షరాలతో పెయింట్ వదిలేసిన బోర్డు ఏర్పాటు చేశారు. మెడికవర్ ఆస్పత్రి బోర్డులు మాత్రం తెలుగులో పెద్ద అక్షరాలతో అవుట్ పోస్టు చుట్టూ ఏర్పాటు చేసేశారు. దీంతో ఇది ట్రాఫిక్ అవుట్ పోస్టా.. మెడకవర్ ఆస్పత్రా అంటూ గుర్తుపట్టలేక పలువురు తికమక పడుతున్నారు.



హనుమంతవాక వద్ద మెడికవర్ ఆస్పత్రి బోర్డులతో ఆరిలోవ ట్రాఫిక్ అవుట్ పోస్ట్

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు..!

సీతమ్మధార: ఇద్దరు చైన్‌స్నాచర్లని నాలుగో పట్టణ క్రైం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని విశ్వసనీయంగా తెలిసింది. సీతంపేట ప్రాంతానికి చెందిన వానపల్లి మంగ (55) పోర్టు స్టేడియం ఈస్ట్ గేటు ప్రాంతంలోని ఒక ఇంట్లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. ఈ నెల 7న ఉదయం 6.30 గంటల సమయంలో అక్కడికి వెళ్తుండగా మార్గమధ్యలో గురుద్వారా వద్ద ఇద్దరు వ్యక్తులు వెనుక నుంచి ద్విచక్ర వాహనం మీద వచ్చి మెడలోని రెండున్నర తులాల బంగారు మంగళసూత్రం తెంపుకుని వెళ్లిపోయారు. వీరు ప్రస్తుతం ఢిల్లీలో వున్నట్టు గుర్తించిన క్రైం పోలీసులు అదుపులోకి తీసుకుని విశాఖ తీసుకొస్తున్నారని సమాచారం.

పీజీ సెట్ రిపోర్టింగ్ తేదీ పొడిగించాలి

విశాఖ సిటీ: ఏపీ పీజీసెట్-2024లో అడ్మిషన్లు పొందిన వారు రిపోర్టింగ్ చేసే తేదీని పొడిగించాలని బీసీ సంఘం నాయకులు సోమవారం ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయ రావుకు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామాల నుంచి విద్యార్థులు రాలేని పరిస్థితి ఉందని, అందుకే తేదీ పొడిగింపుపై ఆలోచించాలని కోరారు. దీనిపై రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాన్ని ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీసీ సంఘం నాయకులు పితాని ప్రసాద్, దంతేశ్వర్ పట్నాయక్ ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న బీసీ సంఘం నాయకులు

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం



పక్కి శ్రావణి

మద్దిపాలెం : హాస్టల్‌లో ఉంటూ నర్సింగ్ కోర్సు అభ్యసిస్తున్న ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన పక్కి శ్రావణి (19) జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ హాస్టల్‌లో ఉంటూ నర్సింగ్ కోర్సు చదువుతోంది. గత నెల 31న ఇంటికి వెళ్తానని చెప్పి హాస్టల్ నుంచి వెళ్లిపోయింది. హాస్టల్ నిర్వాహకులు ప్రతీ ఆదివారం విద్యార్థులతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేయిస్తారు. ఈ క్రమంలో ఈ నెల 8న కుమార్తె నుంచి ఫోన్ రాకపోవడంతో ఆమె తల్లిదండ్రులు బొబ్బిలి నుంచి హాస్టల్‌కు వచ్చారు. అయితే శ్రావణి ఇంటికి వెళ్లిందని హాస్టల్‌లో చెప్పడం... ఆమె ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.